# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 25, అక్టోబర్ 2025


## తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో హై అలర్ట్



వేమనపల్లి, అక్టోబర్ 24, ప్రభాతవార్త

మావోయిస్టు అక్రమ కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా మావోయిస్టు పార్టీ శుక్రవారం భారత్ బంద్‌కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో రామగుండం కమీషనరేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన కోటపల్లి, నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేమనపల్లి, కల్లంపల్లి, వెంచపల్లి ఫెర్రీ పాయింట్లను చెన్నూర్ రూరల్ సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రాణహిత నది సరిహద్దు వెంట ఫెర్రీ పాయింట్లను, పడవ ప్రయాణికులను, రహదారుల వెంబడి కల్వర్ట్స్ అదేవిధంగా వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు. ఈ తనిఖీలలో కోటపల్లి ఎస్ఐ రాజేందేర్, కోటపల్లి, నీల్వాయి పోలీసులు, స్పెషల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ముగిసిన ఆదివాసీల దండారి ఉత్సవాలు

కెరమెరి, అక్టోబర్ 24, ప్రభాతవార్త

ఆదివాసులు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో సంస్ఖ్రుృతి సంప్రదాయాబద్దంగా జరుపుకున్న దండారి ఉత్సవాలు కెరమెరి మండలంలోని చిన్న సాకడ గ్రామంలో శనివారం కొలబోడి పూజలతో ముగిశాయి. భోగి పూజలతో ప్రారంభమైన దండారి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు గ్రామంలో భక్తి శ్రద్దలతో సంస్కృతి సంప్రదాయబద్దంగా ఎత్మసూర్ పెన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రత్యేకమైన సంప్రదాయ వస్త్రధారణతో పురుషులు కాళ్లకు గజ్జెలు కట్టి కోలాటం, డోల్కి, గుస్సాడీ నృత్యాలు, మహిళలు రెలా పాట నృత్యాలు చేస్తూ చూపపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ప్రత్యేకమైన వేషధారణలతో హాస్య నాటికలు ప్రదర్శించారు. ప్రతి రోజు డప్పు చప్పులతో గ్రామమంత హోరెత్తించారు. తమ గ్రామం నుంచి మరొక గ్రామానికి వెళ్లి అతిథ్యాన్ని స్వీకరించి, తమ గ్రామానికి వచ్చిన ఇతర దండారి బృందానికి అతిథ్యమిచ్చి గౌరవ మర్యాదాలు చేశారు. చివరి రోజు ప్రతి ఇంటింటికి వెళ్లి దండరీ బృందానికి మిగతా 2లో..

## మానసిక వేదనతో బిడ్డతో సహా తల్లి బావిలో దూకి ఆత్మహత్య



జన్నారం, అక్టోబర్ 24, ప్రభాతవార్త

మానసిక వేధనతో కన్న బిడ్డతో సహా తల్లి బావిలో దూకి ఆత్మహత్యకు పురికొల్పింది. ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం, జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన చెటుపల్లి శ్రవణ్, జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన స్పందన (24)తో నాలుగేళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఇద్దరు కూతుర్లు సంతానం. చిన్న కూతురు జన్మించిన నుండి ఇద్దరు ఆడపిల్లలే పుట్టారని మానసికంగా కుంగిపోయింది. ఈ క్రమంలో పలుమార్లు తాను చనిపోతానని చెప్పేది. గత ఆరు నెలలుగా ఎప్పుడు మానసికంగా ఆలోచించేది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో చిన్న కూతురు వేధశ్రీకి (9 నెలలు) అన్నం తినిపించుకుంటూ ఉంది. పాపతో పాటుగా వ్యవసాయ బావి వద్దకు వెళ్లి దూకింది. గంట పాటుగా స్పందన కనిపించకపోయే సరికి పరిసరాలు వెదికారు. అనుమానంతో బావిలో చూడగా మృతదేహమై కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై అనూష సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతురాలి తల్లి భూదారపు ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





## ప్రభుత్వ కళాశాల రమ్మంటోంది...



దిలావర్పూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాలపై ప్రత్యేక దృష్టి సాధించింది. 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కృషితో ప్రతిరోజు విద్యార్థులు కళాశాలకు రప్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ప్రతిరోజు కళాశాలకు రాని విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక చర్యలు తీసుకునేలా కార్యాచరణ చేపట్టింది. అధ్యాపకులను క్లస్టర్లుగా విభజించి వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల ఇంటికి పంపుతుంది. వారు పిల్లల ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులను కలిసి ప్రతిరోజు కళాశాలకు విద్యార్థులను పంపించాలని అధ్యాపకులు పేర్కొన్నారు.



నా పేరు వంశీ నేను మొదటి సంవత్సరంలో 500కు 466 మార్కులు సాధించాను. నేను ప్రతిరోజు కళాశాలకు వెళ్లి అధ్యాపకులు చెప్పింది వినడం వల్లే నేను ఈ మార్కులు సాధించాను. ప్రతి ఒక్క విద్యార్థి ప్రతిరోజు కళాశాలకు వస్తేనే అధ్యాపకులు చెప్పినది విని అర్థం చేసుకొని చదివితేనే మనం మంచి మార్కులు సాధిస్తామని తెలిపారు. క్రమం తప్పకుండా తప్పకుండా కళాశాలకు రావాలని పేర్కొన్నాడు.

దిలావర్పూర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు మండలంలోని 11 గ్రామాలతో పాటు సరిహద్దును పంచుకుంటున్న సారంగాపూర్, నర్సాపూర్ మండల గ్రామాల విద్యార్థుల వద్దకు మిగతా 2లో..

* ప్రతిరోజు కళాశాలకు వస్తేనే కొత్త విషయం
* కళాశాలకు విద్యార్థులను రప్పించేందుకు వారింటికే అధ్యాపకులు
* 100 శాతం ఉత్తీర్ణతకై ప్రిన్సిపల్, అధ్యాపకుల సమిష్టి కృషి

## విద్యార్థుల భవిష్యత్ కోసం గుట్టల మధ్య గమనం

✦ గుట్టల మధ్య, రాళ్లురప్పల రహదారి దాటి పాఠశాల సందర్శన

– కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 24, ప్రభాతవార్త

2లో..







## ముగిసిన ఆదివాసీల దండారి ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

మంగళహారతులు ఇచ్చి పూజలు చేశారు. ప్రతి ఇంటి నుండి ధాన్యం, బియ్యం స్వీకరించారు. అనంతరం గుస్సాడీలు, పోరిలు, పురుషులు, మహిళలు డప్పు చప్పుల మధ్య గ్రామం బయట ఉన్న ఇప్ప చెట్టు వద్దకు వెళ్లి దండారీ దీక్షను విరమించారు. ఇప్ప చెట్టు వద్ద గుస్సాడీ నెమలి టోపీలు, డప్పులు, కోలాట సామాగ్రి, సాంప్రదాయ వాయిద్యాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం సమీపంలోని వాగుకు వెళ్లి స్నానాలు ఆచరించారు. సహంపక్తి భోజనాలు చేసి దండారి ఉత్సవాలు ముగించారు.

### విద్యార్థుల భవిష్యత్ కోసం

## గుట్టల మధ్య గమనం

(మొదటిపేజీ తరువాయి)

దూరప్రాంత గుట్టల మధ్య ఉన్న చిన్న పల్లెల్లో కూడా విద్య వెలుగులు చిమ్మాలన్న తపనతో స్కూల్ కంప్లెక్స్ మహిళా ప్రధానోపాధ్యాయురాలు ఆత్రం ప్రమిల తన పరిధిలోని పాఠశాలను స్వయంగా సందర్శించారు. గుట్టల మధ్య, రాళ్లురప్పలు,చెట్ల పొందల రహదారి దాటి ఆ పల్లె పాఠశాలల్లో విద్యార్థుల బాగోగులు పాఠశాలల నిర్వహణపై సమీక్ష చేపట్టారు... కాగజ్‌నగర్ పట్టణంలోని జడ్‌పిఎస్ఎస్(బాయ్స్) సర్‌సిల్క్ కాగజ్‌నగర్ పరిధిలోని మండలంలోని మారుమూల గ్రామంలోని ఎంపీపీఎస్ మానిక్ పటార్ పాఠవాలను నడక దారిలో సుమారు ఎనిమిది కిలోమీటర్ల గుట్టల మధ్య, రాళ్లురప్పలు,చెట్ల పొందల రహదారి దాటి నడుచుకుంటూ వెళ్లి సందర్శించారు. విద్యాభివృద్ధికై పాఠశాలలోని బోధన విషయాలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ మానిక్ పటార్ ఉపాధ్యాయురాలు ఎం.లావణ్య ఉన్నారు.



## మహాలక్ష్మి అమ్మవారిని, గ్రామ దేవతల విగ్రహా ప్రతిష్టించిన గ్రామస్తులు

బజార్‌హత్నూర్, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శ్రీ మహా లక్ష్మి అమ్మవారిని, మైసమ్మ, దొడ్డికాడి మైసమ్మ, మారెమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, పోతరాజు విగ్రహాలను శుక్రవారం ప్రతిష్టించారు. ఒకరోజు ముందు నూతన విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు శోభయాత్రలో ఆడపడుచులు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు.నూతనంగా నిర్మించిన ఆలయాలలో విగ్రహ ప్రతిష్టాపన ప్రారంభోత్సవాలు కన్నుల పండుగ గా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆడపడుచులు,యువకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలు నిర్వహణ

సారంగాపూర్, ప్రభాతవార్త



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల ఆదేశాల మేరకు ఈ రోజు సారంగాపూర్ జడ్.పి.ఎచ్.ఎస్ నందు విద్యార్థి, విద్యార్థినిలకు ఖగమత్తు పదార్దాలు–ముప్పు అంశం పైన వ్యాస రచన పోటీ నిర్వహించడం జరిగింది. పరీక్ష నిర్వహణను ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రేమ్ సింగ్, మాధవ్, రమణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

### - ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఆసిఫాబాద్, అక్టోబర్ 24, ప్రభాతవార్త



నిరుపేదల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అడ గ్రామపంచాయతీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ముగిసినందున నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని, నిర్మాణ దశల వారీగా బిల్లులు సంబంధిత లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ఉచితంగా ఇసుకను అందిస్తుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ఇందిరమ్మ ఇండ్ల పనులను పర్యవేకించాలని, ప్రతిరోజు లబ్ధిదారులతో మాట్లాడి పనుల పురోగతిపై సమీక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి వేణుగోపాల్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

రామకృష్ణాపూర్, ప్రభాతవార్త



మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలు, పారిశుధ్య నిర్వహణ అంశాలను మున్సిపల్ కమిషనర్ రాజు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణలో భాగంగా వార్డులలోని ప్రతి ఇంటి నుండి ప్రతి రోజు తడి చెత్త, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని తెలిపారు. ప్రతి ఇంటికి ఎలాంటి అంతరాయం లేకుండా త్రాగునీరు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీలలో నాటేందుకు అవసరమైన మొక్కలను అభివృద్ధి చేయాలని, మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్ ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో రెండు పడకగదుల ఇండ్ల పథకంలో భాగంగా నిర్మించిన భవనాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న నీటి బ్యాంకుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ రాజలింగుతో కలిసి అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ, త్రాగునీటి సరఫరా, రెండు పడక గదుల ఇండ్ల పథకం నిర్వహణపై సమీక్షించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ప్రభుత్వ కళాశాల రమ్మంటోంది...

(మొదటిపేజీ తరువాయి)



వెళ్లి వారిని కలిసి కళాశాలలో సౌకర్యాలు, వసతులు, సీనియర్ అధ్యాపకులతో నాణ్యమైన బోధన, ఎంసెట్, వంటి కాంపిటీషన్ పరీక్షలకు తరగతులు నిర్వహిస్తున్నామని తల్లిదండ్రులకు వివరించారు. కళాశాలకు రోజు పంపించడం వల్ల విద్యార్థులు కొత్త విషయం నేర్చుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.



సక్రమంగా కళాశాలకు రాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సాధించామని ప్రిన్సిపల్ సుదర్శన్ అన్నారు. దీని కొరకు అధ్యాపకులను క్లస్టర్ గా విభజించి వారి ఇంటికి పంపించి విద్యార్థులను ప్రతిరోజు కలశాలకు వచ్చేలా ప్రేరణ కల్పించాలని సూచించాము. వారి తల్లిదండ్రులకు సూక్ష్మంగా వివరించి విద్యార్థులను పంపించేలా చేయాలని అధ్యాపకులను ప్రోత్సహించినట్లు పేర్కొన్నారు. పాఠశాలకు ప్రతిరోజు వస్తేనే విద్యార్థులు ప్రతి విషయం తెలుసుకొని వార్షిక పరీక్షల్లో ఉన్నత మార్కులు సాధిస్తారని తెలిపారు.



ప్రతిరోజు కళాశాలకు వచ్చే విద్యార్థులకు మాత్రమే సబ్జెక్టుపై పూర్తి అవగాహన వస్తుందని సీనియర్ ఆధ్యాపకులు రామారావు అన్నారు. మేము ప్రతిరోజు కళాశాలకు వచ్చిన విద్యార్థులకు కొత్త విషయాలు నేర్పుతూ వార్షిక పరీక్షల్లో ఉన్నత మార్కులు సాధించేలా పరీక్షలు, రోజువారి పరీక్షలు, ముఖాముఖ ప్రశ్నలు వంటి వాటిని నిర్వహిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు పాఠశాలకు పంపితేనే అన్ని నేర్చుకుంటారని ఆయన పేర్కొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

**- ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి**

ఆసిఫాబాద్, అక్టోబర్ 24, ప్రభాతవార్త

ప్రజా సంక్షేమం దృష్ట్యా జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారులతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలో చేపట్టిన పనులు ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సదరం శిబిరాల ద్వారా అర్హత కలిగిన దివ్యాంగులకు యు.డి.ఐ.డి.




గుర్తింపు కార్డులు జారీ చేయాలని తెలిపారు. నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని, త్వరగా ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసుకునే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలని, గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రులుఉపాధ్యాయుల సమావేశాలలో తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ విద్యార్థులు చదువులో రాణించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మండల విద్యాధికారులు, సహాయ ప్రాజెక్టు అధికారులు, సహాయ ప్రోగ్రాం మేనేజర్లు, పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భీమన్న గుట్ట ప్రాంతం కాపాడండి

సారంగాపూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లా కేంద్రంలోని భీమన్న గుట్ట ప్రాంతం అన్యాక్రాంతం కాకుండా చూడాలని ముదిరాజ్‌లు కోరినారు. ఈ కార్యక్రమానికి సారంగాపూర్, దిలావార్పూర్, నర్సాపూర్, మామడ, నిర్మల్, మండల ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి భీమన్న గుట్ట ప్రాంతమంతా ముదిరాజ్ కులస్తుల వివిధ రకాల పండ్ల చెట్లను పెంచుకొని వాటిపై జీవనాన్ని కొనసాగిస్తున్నారు. నిర్మల్ పట్టణము రోజురోజుకు అభివృద్ధి చెందడంతో ఆ గుట్టపై నాయకులు కన్నేసినారు. ఈగుట్ట ప్రాంతంలోని భూమికి లక్షలలో విలువ ఉంది. దీనితో వేరే సామాజిక వర్గాలకు చెందినటువంటి వారికి నిర్మాణాలకు నాయకులు ఇవ్వడం జరుగుతుంది. కొన్ని సంవత్సరాల నుంచి దీనిపై ఆధారపడి ఉన్న ముదిరాజ్‌లు జీవనోపాధి కోల్పోయి వీధిన పడుతామని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం వినతి పత్రాన్ని అందించడం జరిగింది. ఈ భీమన్న గుట్ట ప్రాంతాన్ని అక్రమణలకు గురి కాకుండ ఆపాలని విన్నవించాం. లేని ఎడల జిల్లా స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ప్రారంభిస్తామని తెలిపినారు.



## పీఎం ఆవాస్ రీవెరిఫికేషన్ సర్వేను పక్కాగా నిర్వహించాలి

**- ఎంపిడీఓ సత్య నారాయణ**

జైపూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త

శుక్రవారం మండల ప్రజా పరిషద్ కార్యాలయంలో ఎం.పి.డీ.ఓ సత్యనారాయణ, ఎంపీ.ఓ శ్రీపతి బాపు రావు, హౌసింగ్ ఏ.ఈ కాంక్షల ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బంది అయినా టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎం అవాస్ రీ వెరిఫికేషన్ సర్వేలో భాగంగా ఉపాధి హామీ సిబ్బందికి చెకర్ లాగిన్స్ ఇచ్చారు. లాగిన్స్ గురించి అవగాహన కల్పించారు. లాగిన్స్ ఉపయోగించి రీ వెరిఫికేషన్ సర్వేను ఈ నెల 30 లోపు పూర్తి చేయాలని సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్‌లకు ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపిఓ బి. బాలయ్య, రాజమొగిలి సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు వసూలు చేయండి

మామడ, అక్టోబర్ 24, ప్రభాతవార్త

మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో మామడ మండల పంచాయతీ అధికారి దొంతుల ఉపేందర్ శుక్రవారం పర్యటించారు. వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, పంచాయతీ రికార్డులు, ప్రతి రోజు చెత్త సేకరణ చేపట్టాలని, తడి పొడి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని సూచించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి అశ్విత, సిబ్బంది ఉన్నారు.



## వ్యాపారవేత్త ఆత్మహత్య

కెరమెరి, అక్టోబర్ 24, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని ఓ వ్యాపారవేత్త మద్యానికి బానిసై మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎన్. మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి ఫాడ్ బాలు (40) అనే వ్యాపారవేత్త మద్యానికి బానిసై ఉరి వేసుకున్నట్లు, మృతుడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం సత్వాజిగూడ గ్రామానికి చెందిన వ్యక్తి అని గత మూడు సంవత్సరాల క్రితం కెరమెరి మండల కేంద్రానికి వచ్చి కిరాణా కొట్టు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత నాలుగు రోజుల నుండి అతిగా మద్యం సేవించి తల్లిదండ్రులకు తాను చనిపోతానని తెలిపినట్లు గురువారం ఇంటికి రాకపోవడంతో తండ్రి కోసం కుమారుడు కిరాణా దుకాణం షట్టర్ తీసి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించినట్లు అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. మృతుడి అన్న సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## బదిలీ పై వెళ్తున్న సింగరేణి ఐఈడీ అధికారికి సన్మానం

జైపూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త

సింగరేణి ఐఈడి ఆఫీసర్ల బదిలిలలో, ఎస్టిపిపి నుండి ఇల్లందు ఏరియాకు బదిలీపై వెళ్తున్న ఐఈడి డీ.జి.ఎం ప్రభాకర రావుకు శుక్రవారం ఎస్టిపిపి అధికారులు, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్.టీ.పి.పి ఈడి చిరంజీవి, ఎస్టిపిపి జి.ఎం నరసింహా రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ప్రభాకర రావుతో కలసి పనిచేసిన అనుభవాలను పంచుకొన్నారు. ప్రభాకర రావు ఎస్టిపిపిలో సుదీర్ఘ కాలం తన సేవలను అందిచారన్నారు. ప్రభాకర రావు తన విధినిర్వహణలో అంకితభావంతో పనిచేస్తారని, ఏ పనినైనా నిబద్ధతతో చేసేవారని తెలిపారు. అధికారులకి బదిలీ అనేది సహజం అని, ఎక్కడికి వెళ్ళినా సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని తెలియజేశారు. ప్రభాకర రావు ఎస్టిపిపిలో దాదాపు 14 సంవత్సరాలు పనిచేశారని, ప్లాంటు నిర్మాణ దశ నుండి ప్లాంటు పూర్తయ్యే వరకు అనేక రకాలుగా తన సేవలు అందిచారన్నారు. ప్లాంటు ఉద్యోగులతో సౌమ్యంగా ఉంటూ, అధికారులతో స్నేహ పూర్వక సంబంధాలు కొనసాగించారని తెలియజేశారు. అనంతరం ప్రభాకర రావు మాట్లాడుతూ ఎస్టిపిపిలో ఇంత కాలం పనిచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.జీ.ఎం (పిసిఎస్) చీఫ్(ఓ ఎం) మదన్మోహన్, ఏఐటియుసి పిట్ సెక్రటరీ సి.హెచ్ సత్యనారాయణ, సి.ఎం.ఓ.ఏ.ఐ బ్రాంచ్ సెక్రెటరీ సంతోష్ కుమార్, సోలార్ ఏ.జీ.ఎం శ్రీనివాస్, సివిల్ డి.జి.ఎం ఆజాజుల్లా ఖాన్, (1x800 ఎండబ్ల్యు) డీ.జి.ఎంవేణుగోపాల్, పర్సనల్ డి.జి.ఎం కిరణ్ బాబు ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## అధ్యాపకురాలికి డాక్టరేట్

ఆసిఫాబాద్, అక్టోబర్ 24, ప్రభాతవార్త



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలుగా పనిచేస్తున్న చైతన్య కుమారి డాక్టరేట్ సొంతం చేసుకుంది. రాజనీతి శాస్త్ర విభాగంలో ఖపబ్లిక్ పాలసీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ ఏ స్టడీ ఆఫ్ ఐటీడీఏ ప్రోగ్రామ్స్ ఇన్ కొమురం భీమ్ ఆసిఫాబాద్ డిస్ట్రిక్ట్గ అంశంపై కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి కట్ల రాజేందర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా చైతన్య కుమారి మాట్లాడుతూ డాక్టరేట్ పట్టా పొందడం సంతోషంగా ఉందని, ఇది మరింత బాధ్యతను పెంచిందన్నారు. డాక్టరేట్ పొందడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## కేయూ డిగ్రీ పరీక్ష ఫీజు గడువు ఈనెల 27 వరకు పెంపు

**- బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షల నిర్వహణ కోఆర్డినేటర్ ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్**

బెల్లంపల్లి, అక్టోబర్ 24, ప్రభాతవార్త

కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ల పరీక్ష ఫీజు గడువు ఈనెల 27వ తేదీ వరకు పొడిగించినట్లు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షల నిర్వహణ కోఆర్డినేటర్ ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు తొలుత ఈనెల 23 వరకు ఉండగా ఆ గడువు ముగియడంతో మరో నాలుగు రోజులు పెంచి ఈనెల 27 వరకు ఫీజు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు వివరించారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివి రెగ్యులర్ మరియు బ్యాక్లాగ్ విద్యార్థిని విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. పరీక్ష ఫీజును ఆన్లైన్లో మీ సేవ సెంటర్ ద్వారా చెల్లించి ఆ రిసిప్టులకు కళాశాలలో ఇచ్చే దరఖాస్తును నింపి జత చేసి కార్యాలయ విభాగంలో అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించవచ్చని పరీక్షల నిర్వహణ కోఆర్డినేటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ సూచించారు.



# ప్రజలకు మరింత చేరువలో యూనియన్ బ్యాంక్ సేవలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త**

ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కృషి చేస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండలం గద్దెరాగడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ కార్యాలయాన్ని సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజినల్ హెడ్ (ఎ.జి.ఎం.) రాధాకృష్ణ, లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి, శాఖ మేనేజర్ సంజీవ్ తలకోటి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గద్దెరాగడి శాఖ కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వారా ప్రజలకు, బ్యాంకు వినియోగదారులకు బ్యాంకు సేవలను మరింత అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. పొదుపు, బీమా, పెన్షన్, పెట్టుబడులు ఇతర



అనేక అంశాలలో ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందని, ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. శాఖ కార్యాలయం అభివృద్ధికి బ్యాంక్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తద్వారా జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వినతి పత్రం అందజేత

**సిర్పూర్ (టి), అక్టోబర్ 24, ప్రభాతవార్త :**

కొమరం భీం జిల్లాలోని వీఆర్ఏ వారసులు శుక్రవారం రోజున కలెక్టరేట్ ఏవో కిరణ్ కుమార్‌కి వీఆర్ఏ వారసత్వ ఉద్యోగం ఇవ్వాలని కొమరం భీం వీఆర్ఏ సంఘం అధ్యక్షులు దుర్గం అంకులు వినతి పత్రంఅందజేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 81 ,85 ప్రకారం వీఆర్ఏ వారసులకు ఉద్యోగులు వస్తాయని ఎదురుచూస్తున్నామని అన్నారు . జిల్లాలో 61 సంవత్సరాలు వయస్సు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం అంకులు,కంటేశ్వర్, పిప్రే చంద్రశేఖర్,గిర్మాజీ సంతోష్, వెంకటి,పోచమల్లు, రమేష్, పోశం,తిరుపతి, భీమక్క తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై గొడ్డలితో దాడి... పరిస్థితి విషమం

**పెంచికల్ పేట్, అక్టోబర్ 24, ప్రభాతవార్త :**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలంలోని దర్గాపల్లి గ్రామానికి చెందిన కర్నె బాపు అనే వ్యక్తిపై శుక్రవారం అదే గ్రామానికి చెందిన సొద్గరి ఇస్తారి అనే మరో వ్యక్తి గొడ్డలితో మెడ భాగంలో దాడి చేయగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లుగా పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా సమాచారం ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## కేసీఆర్, అనిల్ జాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన దేగామ గ్రామస్తులు

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త**

మండలంలోని దేగామ గ్రామంలో కెసిఆర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ల చిత్ర పటాలకు దేగామ గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే గారి సహకారంతో గ్రామంలో నాలుగు హైమస్ ఎల్ఈడి లైట్లు ఏర్పాటు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి అండగా కోనేరు అభిమానులు

**సిర్పూర్ (టి). అక్టోబర్ 24 ప్రభాతవార్త :**

సిర్పూర్(టి)మండల కేంద్రానికి చెందిన డోంగ్రే అరుణ్ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు.నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న కోనేరుకోనప్ప అభిమానులు వారి కుటుంబానికి 18,120 రూపాయల నగదు పాటు 50 కిలోల బియ్యం కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తోట మహేష్, మాజీ ఎంపిటిసి దుర్గం విక్రమ్ వార్డ్ సభ్యులు సెండ్ లాలాజీ సంతోష్ ఇఫత్ హుస్సేన్ నాయకులు మోహన్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు పరీక్ష ఫ్యాండ్ల, పెన్నులు పంపిణీ

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 24, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన దేటి రమేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని చింతగూడ ఎంపీపీఎస్ పాఠశాలో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్లు, పెన్నులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం తన పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతుగా ఫ్యాడ్లు, పెన్నులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమ్మరి హరీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. స్వప్న, చింతగూడ కోయవాగు గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఆదె రాజు, జాడి దీపక్, సంతోష్, కృష్ణ, తన్నీరు కిరణ్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





## కంపు కొడుతున్న మురికి కాలువ

**బెజ్జూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండలంలోని కుష్ణపల్లి గ్రామంలో మురికి కాలువలు నిండిపోయి తీవ్ర దుర్వాసనను వెదజల్లుతున్నాయి. ఎండాకాలం నుంచి ఇప్పటివరకు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద పెరిగి జ్వరాలు వస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి, మురుగు కాలువల్లోని చెత్తను తక్షణమే తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.




## ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్షా సమావేశం

**సారంగాపూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని రైతు వేదికలో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ ఫైజల్ అహ్మద్ హాజరైనారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాలపంచాయతీ కార్యదర్శులు హాజరైనారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఏ విధంగా కొనసాగుతున్నాయి. నిర్మాణ కార్యక్రమాలు ఎంతవరకు వచ్చినాయి అని పంచాయతీ కార్యదర్శుల నుండి అడిగి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ళను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి రాజేశ్వర్, హౌసింగ్ డిఇ గంగాధర్, తాసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఎపీఓ నజీర్ ఖాన్, ఏపిఎం సునంద, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు



## శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

**వేమనపల్లి, అక్టోబర్ 24, ప్రభాతవార్త**

చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణానికి వేమనపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో శుక్రవారం ఆరెకుల సంఘ పెద్దలు భూమి పూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ వచ్చే చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వరకు విగ్రహ ప్రతిష్టాపన పూర్తి చేస్తామని తెలిపారు. చత్రపతి శివాజీ ఆదర్శ పరిపాలన కొనసాగించాలని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆరెకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చాపిల రావుజీ పటేల్, ఆరెకుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుబిడే వెంకటేశం పటేల్, ఆరెకుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కుబిడే మధుకర్ పటేల్, మానెపల్లి సత్యనారాయణ పటేల్, ఎనుముల వెంకటేశం పటేల్, బోర్కుటి సంతోష్ పటేల్, వేమనపల్లి ఆరెకుల సంఘం గ్రామ అధ్యక్షులు ఎనుముల శేఖర్ పటేల్, గ్రామ ఉపాధ్యక్షులు తెలిగ పోశెట్టి పటేల్, కుర్రు వెంకటేశం, చౌదరి సురేష్ పటేల్ హిందూ యువ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# హెచ్ఐవి నియంత్రణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

**- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్**

**వెంకటేష్ ధోత్రే**



ఆసిఫాబాద్, అక్టోబర్ 24, ప్రభాతవార్త

హెచ్ఐవి ఎయిడ్స్ లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి నియంత్రణలో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, తెలంగాణ హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం మంచిర్యాల కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నీలిమలతో కలిసి పాల్గొని కలెక్టరేట్ భవనం నుండి పట్టణంలోని బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొమురంభీం ఆసిఫాబాద్ ను హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత జిల్లాగా నిర్మిద్దామని, ప్రతి ఒక్కరూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వంటి లక్షణాలు ఉంటే వీలైనంత త్వరగా పరీక్షించుకొని సత్వర వైద్య సేవలు పొందాలని, జీవిత భాగస్వామికి కూడా పరీక్షలు చేయించాలని తెలిపారు. వ్యాధిగ్రస్తుల పట్ల స్నేహభావంతో కలిసిమెలిసి వారిలో ఆత్మస్థైర్యం నింపాలని తెలిపారు. వ్యాధి వ్యాప్తి నివారణకు నిరంతరం సహకరించాలని, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారిని ఆదరించి ఆత్మవిశ్వాసం కల్పించాలని తెలిపారు. అనంతరం హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ పట్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి

ఆసిఫాబాద్, అక్టోబర్ 24, ప్రభాతవార్త

కొమరం భీం జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న తెలంగాణ స్టేట్ వైడ్ ఏరియా నెట్వర్క్ (టీస్వాన్) ఉద్యోగుల పెండింగ్ వేతనాలు ఇప్పించేలా చూడాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో వేతనాలు ఇప్పించేలా చూడాలని కోరుతూ టిస్వాన్ ఉద్యోగులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వ టిస్వాన్ ప్రాజెక్ట్ టెండర్లలో భాగంగా హైదరాబాదులోని అక్షర ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం దక్కించుకుందని, జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల్లో నెట్వర్క్, ఇంటర్నెట్ ఆధారిత సాంకేతిక నిపుణులుగా తమను ఉద్యోగులుగా నియమించారని తెలిపారు. గత 5 నెలలుగా తమకు వేతనాలు యాజమాన్యం చెల్లించడం లేదని, దీనితో కుటుంబ పోషణ భారంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై యాజమాన్యంను వెళ్లి అడుగగా ప్రభుత్వం తమకు బడ్జెట్ ఇవ్వడం లేదని దీనితో వేతనాలు చెల్లించడం నిలిపి వేశామని బదులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయాలను కలెక్టరేట్ దృష్టికి తీసుకురాగా సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొమురం భీం జిల్లా టిస్వాన్ డిహెచ్‌క్యూ ప్రశాంత్, నెట్వర్క్ ఇంజనీర్లు శ్రీధర్, లక్ష్మణ్, వ్యాసమూర్తి ఉన్నారు.

# గ్రామంలో స్వచ్ఛంద మద్యపాన నిషేధ తీర్మాణం

వేమనపల్లి, అక్టోబర్ 24, ప్రభాతవార్త



గుడుంబా నిర్మూలనకు మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని సుంపుటం గ్రామ యువకులు నడుం బిగించారు. శుక్రవారం గుడుంబా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గుడుంబా అమ్మిన తయారుచేసిన, రవాణా చేసిన అబ్కారీ శాఖ, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. గుడుంబా అమ్మకాలు ఎక్కువ కావడంతో కుటుంబాలు చిన్నభిన్నం అవుతున్నాయని చెప్పారు. గుడుంబాను తాగడంతో గ్రామంలో చాలా మంది అనారోగ్యం బారిన పడుతున్నారని ఆసుపత్రులు చుట్టూ తిరిగిన కోలుకోవడం లేదన్నారు. దీంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో పురుషులు, మహిళలు, యువత గ్రామ ప్రజలు సమిష్టి నిర్ణయం తీసుకొని గ్రామస్తులు అందరికీ సమక్షంలో గ్రామంలో ఎవరైనా గుడుంబా, బెల్ట్ షాపులు వారు మద్యం తీసుకువచ్చి అమ్మిన, రవాణా చేసిన పోలీసులకు పట్టిస్తామని గుడుంబాతో కలిగే అనర్థాలకు ప్రజలకు వివరించారు. ఇట్టి ఉల్లంఘన అతిక్రమించిన వారిపై గ్రామ వేదిక తీర్మానం మేరకు రూ.50 వేలు జరిమానా విధించడం జరుగుతుందని గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. వీరిలో కొండగొర్ల బాపు, కుబిడే వెంకటేశం, కుబిడే రవీందర్, దందెర మహేష్, కుబిడే శేఖర్, కుబిడే ముసలయ్య, అల్గాం సత్యన్న, కుబిడే నానేష్, దుర్గం తిరుపతి, దుర్గం మధునయ్య, బద్ది మహేష్, శీలం శ్రీకాంత్, దన్నూరి చిరంజీవి, కుబిడే ముత్తేష్, చప్పిడి తిరుపతి, లంగారి దేవయ్య, చెడవాయి శ్రీకాంత్, కుబిడే మహేష్, ఇగురం వెంకటి గ్రామ యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా తాతాయి విగ్రహ ప్రతిష్టాపన

సారంగాపూర్, అక్టోబర్ 24, ప్రభాతవార్త



మండలంలోని ఆలూరి గ్రామంలో గురువారం నుండి తాతాయి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. కార్యక్రమం మొదటి రోజున తాతాయి పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించగా, శుక్రవారం రోజున విగ్రహాలను గ్రామ వీధుల గుండఊరేగింపు చేయగా, ఇందులో గ్రామంలోని ప్రజలందరు పాల్గొన్నారు. అనంతరం విగ్రహాలను తీసుకువచ్చి తాతాయి సన్నిధిలో ప్రతిష్టకు ముందు ఉంచారు. భక్తులతో కిటకిటలాడిన గ్రామంలో గణపతి పూజ, హోమం వంటి ధార్మిక కార్యక్రమాలు విశేషంగా నిర్వహించబడ్డాయి. తాతాయి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం గ్రామ ప్రజలందరు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రతిష్టా కార్యక్రమాలను ఆలూరి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.



# ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

**- కబ్జాదారులపై పీడీ యాక్ట్ పెట్టాలి**

**- ఎంసిపిఐయు పార్టీ జిల్లా కమిటీ డిమాండ్**

బెల్లంపల్లి, అక్టోబర్ 24, ప్రభాతవార్త

బెల్లంపల్లి ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములను కాపాడాలని, అద్దె భవనాలలో కొనసాగిస్తున్న ప్రభుత్వ ఆఫీసులకు పక్క భవనాలు నిర్మించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లిలో కబ్జారాయులకు అడ్డు అదుపు లేకుండా పోయిందని స్మశాన వాటికలు కూడా వదలడం లేదని, బెల్లంపల్లిలో కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడిపిస్తున్నప్పటికీ బెల్లంపల్లిలో అడ్డగోలుగా ప్రభుత్వ భూములు, సింగరేణి భూములు, కబ్జాలు చేస్తున్న కూడా అధికారులు చూస్తూ ఉండటం అనేది చాలా బాధాకరమని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జా కోరల నుండి ప్రభుత్వ స్థలాలు కాపాడాలని, అదే స్థలాలలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని కజ్జాలు చేస్తున్న వారిపై పిడి యాక్ట్ లు పెట్టాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి తోగరి రాహుల్, మేకల సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ స్వర్శ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**- నిరుపేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం**

**- సిర్పూర్ పేపర్ మిల్లు వైద్యుడు డాక్టర్ శశిధర్ రెడ్డి**

కాగజ్‌నగర్ రూరల్ ,అక్టోబర్ 24, ప్రభాతవార్త :

సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సిఎస్ఆర్) సేవా కార్యక్రమాల్లో భాగంగా స్వర్శ సోషల్ ఫౌండేషన్ సహకారంతో కాగజ్‌నగర్ మండలంలోని బోడెపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చినట్లు డాక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన 150 మందికి డాక్టర్ శశిధర్ రెడ్డి, వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మారుమూల గ్రామాల నిరుపేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సిర్పూర్ పేపర్ మిల్లు స్వర్శ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ రేవతి, సభ్యులు సుశీల, శివ, పేపర్ మిల్లు వైద్య సిబ్బంది తన్నీరు విజయ్‌కుమార్, ఎస్. సుమన్, సిస్టర్ శ్రీవాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, మాజీ సర్పంచ్ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

